క్లుప్తంగా

ఘనంగా అగస్త్యేశ్వరుడికి భస్మార్చన


అగస్త్యేశ్వరస్వామికి హారతి ఇస్తున్న అర్చకుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అమావాస్య సందర్భంగా స్వామికి ఘనంగా భస్మార్చన నిర్వహించారు. స్వామివారికి వేద పండితులు ప్రదోష కాల సమయంలో పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్య, రుద్రాభిషేకం నిర్వహించి సహస్రనామార్చన, భస్మార్చన నిర్వహించి భస్మహారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వీధి కుక్కల నుంచి కాపాడండి


పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు వినతి పత్రం ఇస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

ప్రొద్దుటూరు : కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని గోపవరం గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు బుధవారం డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మేరీకుమార్, విశ్వనాథ్ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ఉప్పాగు ప్రాంతంలో వీధి కుక్కల బెడద ఎక్కువైందన్నారు. ఇటీవల చిన్న పిల్లలు, పెద్దలు, వృద్ధులను వీధి కుక్కలు కరవడంతో ఆస్పత్రులకు వెళ్లాల్సి వచ్చిందన్నారు. రాత్రి సమయాల్లో కుక్కలు మరింత ప్రమాదకరంగా మారి వెంటపడటంతో పిల్లలు, వృద్ధులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని తెలిపారు. వెంటనే అధికారులు కుక్కల నుండి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరారు.

ఇండియన్ అచీవర్స్ అవార్డు ప్రదానం


అవార్డు అందుకుంటున్న డాక్టర్ అంబవరం ప్రతాప్‌రెడ్డి

అట్లూరు : డాక్టర్ అంబవరం ప్రతాప్‌రెడ్డికి ప్రతిష్టాత్మకమైన ఇండియన్ అచీవర్స్ అవార్డు లభించింది. వైఎస్సార్ జిల్లా బద్వేలు మండలానికి చెందిన అంబవరం ప్రతాప్‌రెడ్డి అంబవరం నీరా చారిట్రబుల్ ట్రస్టు స్థాపించి వన్య ప్రాణుల సంరక్షణకు కృషి చేస్తున్నారు. అలాగే అంబవరం సెంటర్ ఫర్ సైకాలజికల్ రీసెర్చ్ అండ్ వెల్బీయింగ్ అసోసియన్ ద్వారా మానసికంగా కుంగిపోతున్న చాలామందికి భరోసా కల్పిస్తూ.. వాళ్లలో మనోధైర్యాన్ని నింపుతున్నారు. ఆయన సేవలను గుర్తించిన ఇండియన్ అచీవర్స్ అవార్డును ఈ నెల 22న హైదరాబాదులో అందజేశారు.


చెత్తా చెదారం తొలగింపు


చెత్తను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

పోరుమామిళ్ల : పట్టణ ప్రధాన రహదారిలో అసంపూర్తిగా ఆగిపోయిన డివైడర్‌ను రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణ యజమానులు డస్ట్‌బిన్‌గా వినియోగిస్తున్నారని సాక్షి దినపత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. పంచాయతీ సిబ్బంది బుధవారం డివైడర్‌లో ఉన్న చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, దుకాణాల్లోని పాడైన అట్టలు తొలగించారు. డివైడర్‌లో చెత్తా చెదారం వేయకుండా చర్యలు తీసుకోవాలని మానవహక్కుల నేతలు పంచాయతీ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

సాక్షి ఎఫెక్ట్

కాలువల్లో చెత్తను తొలగించాలి


మోడంపల్లెలో పర్యటించిన మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర

ప్రొద్దుటూరు : డ్రైనేజీ కాలువల్లో చెత్తను తొలగించాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని తిలక్ రోడ్డు ఎదురుగా ఉన్న చెత్త పాయింట్‌ను బుధవారం శుభ్రం చేయించారు. మోడంపల్లెలోని శేషాద్రి అపార్ట్‌మెంట్ వద్ద కొత్తపల్లె కెనాల్‌లో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

‘కట్’కట

- విద్యుత్ సరఫరాలో అంతరాయం
- సకాలంలో నీరు అందక ఎండిపోతున్న పంటలు
- ఆందోళనలో రైతులు


చెన్నవరం విద్యుత్ సబ్‌స్టేషన్


ఎండిపోతున్న పెసరపంట

గోపవరం : చెన్నవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. తరచూ ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయాలతో రైతులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ ఎప్పుడు వస్తుందో? ఎంతసేపు ఉంటుందో? తెలియని దుస్థితి నెలకొంది. గంటల తరబడి కరెంట్ పోతుండడంతో తాము సాగు చేసిన పొలాలకు నీరందక రైతులు దిగులు చెందుతున్నారు. కరెంట్ వస్తూ పోతుండడంతో వ్యవసాయ బోర్ల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. మండలానికి సంబంధించి చెన్నవరం విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి రెండు ఫీడర్లుగా విద్యుత్ సరఫరా అవుతుంది. అయితే 20 రోజులుగా వ్యవసాయానికి ఇచ్చే విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారింది. కనీసం ఒక గంట వ్యవధిలో పదిసార్లు అంతరాయం ఏర్పడుతోంది. రోజంతా 10 సెంట్ల భూమికి కూడా నీరందడం లేదని రైతులు ఆందోళనకు చెందుతున్నారు.

సాగుకు తప్పని కరెంట్ కష్టాలు

ప్రస్తుత సీజన్‌లో సజ్జ, పెసర పంటను రైతులు సాగు చేశారు. వేళాపాళా లేకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండడంతో తలపట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. రుతుపవనాలు విస్తరించి వర్షాలకు కురుస్తాయని ఆశగా ఎదురుచూశారు. కానీ వరుణుడు ముఖం చాటేయడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ఒక పక్క ఎండ, మరొకపక్క గాలి విపరీతంగా వీస్తుండడంతో పంటలు రైతుల కళ్ల ఎదుటే ఎండిపోతున్నాయి. ఇలాగే ఉంటే సాగుకు పెట్టిన పెట్టుబడి కూడా రాదని అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఎనర్జీ అసిస్టెంట్లు, లైన్‌మెన్లు, ఏఈలు ఎంత మంది సిబ్బంది ఉన్నా విద్యుత్ సరఫరాలో మాత్రం తరచూ అంతరాయం ఏర్పడుతూనే ఉంది. విద్యుత్ లైన్లు వేలాడుతుండడంతో చిన్న గాలి వీచినా రాపిడి వలన తరచూ ట్రిప్ అవుతోందని సబ్‌స్టేషన్ సిబ్బంది చెబుతున్నారు. విద్యుత్ లైన్లు సరి చేయాల్సిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో తరచూ విద్యుత్ సరఫరా ఏర్పడుతుందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా 9 గంటలు నిరంతరాయంగా సరఫరా చేయాలని అధికారులను కోరుతున్నారు.

ఆయిల్ పామ్ సాగుతో నిరంతర ఆదాయం


మాట్లాడుతున్న ఉద్యానవన శాఖాధికారి జయభరత్ రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్ : ఆయిల్ పామ్ సాగుతో నిరంతర ఆదాయం పొందవచ్చని ఉద్యవనశాఖాధికారి జయభరత్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఉప్పరపల్లె, తాళ్లమాపురం, నంగనూరుపల్లె, కామనూరు, సోముల వారిపల్లె గ్రామాల్లో బుధవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయభరత్ రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఎక్కువ శాతం వంట నూనెలను దిగుమతి చేసుకోవడం వల్ల ఆయిల్ పామ్ సాగుపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టి సారించిందన్నారు. ఒక ఎకరా వరి సాగు చేసే నీటితో మూడు ఎకరాల ఆయిల్ పామ్ సాగు చేసుకోవచ్చన్నారు. ఎకరాకు 30 అడుగులు పొడవు, వెడల్పు ఉండేలా 50 మొక్కలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మొక్కలను రైతులకు ఉచితంగా అందిస్తామన్నారు. ఈ ఆయిల్ పామ్ సాగులో అంతర పంట సాగుచేస్తే ఎకరాకు రూ.4,200 రైతుకు ఉచితంగా ఇస్తామన్నారు. డ్రిప్ ఏర్పాటుకు ప్రభుత్వం 90 శాతం రాయితీ ఇస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గరిష్టంగా ఒక్కొక్క రైతుకు 25 ఎకరాల వరకు ఆయిల్ పామ్ సాగుకు రాయితీ ఇస్తుందని తెలిపారు. ప్రొద్దుటూరు మండలంలో సువెన్ అగ్రి ఇండస్ట్రీస్ వారికి ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చిందన్నారు. ఈ ఆయిల్ పామ్ సాగు చేయడం వలన రైతులకు మంచి లాభాలు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సురేష్ రెడ్డి, సువెన్ అగ్రో ఇండస్ట్రీస్ ప్రతినిధులు కొండారెడ్డి, తేజ, రైతు సేవా కేంద్రం సిబ్బంది హరీంద్ర, ప్రతాప్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ సిబ్బందికి పెండింగ్ జీతాలు చెల్లించాలి


హాస్పిటల్ ఆవరణలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, శానిటేషన్ సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి రావాల్సిన నాలుగు నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, హాస్పిటల్ గౌరవాధ్యక్షుడు రాఘవులు కోరారు. జిల్లా ఆస్పత్రి ఆవరణలో బుధవారం శానిటేషన్ సిబ్బందితో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్పిటల్‌లో 65 మంది పారిశుద్ధ్య కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. నాలుగు నెలలుగా సంబంధిత కాంట్రాక్టర్ వారికి జీతాలు చెల్లించలేదని చెప్పారు. ప్రభుత్వ జీఓ ప్రకారం కార్మికులకు రూ.16,400 వేతనం ఇవ్వాల్సి ఉండగా రూ.12,400 మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకుంటే వారి కుటుంబాలు ఎలా గడుస్తాయన్నారు. ఏడాదికి రెండు జతల యూనిఫాం ఇవ్వాల్సి ఉంటే ఇంత వరకు ఒక జత కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు. సిబ్బంది సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రూపానంద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ యూనియన్ అధ్యక్షురాలు రత్నమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహులు, సహాయ కార్యదర్శి గంగాధర్, కోశాధికారి మహేష్, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో గురువారం నుంచి శనివారం వరకు మహిళా సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ సూర్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ శిక్షణలో ప్రొద్దుటూరు, చాపాడు, జమ్మలమడుగు, దువ్వూరు, కొండాపురం మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు. మహిళా నాయకత్వంలో మార్పు, స్థానిక స్వపరిపాలనలో సాధికారత, స్థానిక పాలనలో మహిళలకు అవకాశాలు, పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళా ప్రజాప్రతినిధుల పాత్ర, వారి బాధ్యతలు వంటి వాటిపై శిక్షణ ఉంటుందని వివరించారు. శిక్షణ చివరి రోజున సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

పశు బీమా చేయించుకోవాలి

చాపాడు : మండల వ్యాప్తంగా పాడి రైతులు తమ పశువులకు పశు బీమాను చేయించుకోవాలని మండల పశు వైద్యాధికారి మహమ్మద్ గౌస్ తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలోని వెటర్నరీ అసిస్టెంట్లు, పశు వైద్య శాలలో సిబ్బంది సంప్రదించి ప్రభుత్వ సహకారంతో రైతులు పశు బీమాను చేయించుకోవచ్చని పశు వైద్యాధికారి చెప్పారు.

నేటి నుంచి బోనాల పండుగ

బి.కోడూరు : అంకాలమ్మ ఆషాడమాస బోనాల పండుగను గురువారం నుంచి వచ్చే నెల 24 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త ఓ.ప్రభాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బోనాల పండుగకు మండలంలోని తువ్వపల్లె, తవటవారిపల్లె, బోడుగుండుపల్లె, గుంతపల్లె, మున్నెల్లి, రాజుపాళెం, గోవిందాయపల్లె, ఐత్రంపల్లె తదితర గ్రామాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవాలని ఆయన తెలిపారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

ప్రొద్దుటూరు రూరల్ : విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఎంబీజే పట్టణాధ్యక్షుడు హుస్సేన్ బాషా కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో బుధవారం ఈఈ కేవీవీ రమణారెడ్డికి ఆయన వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో అరగంట నుండి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు. అస్లాం, రఫీ, ముక్తియార్ పాల్గొన్నారు.

ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి

బద్వేలు అర్బన్ : ప్రైవేటు విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ప్రభాకర్ విమర్శించారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయం జేవీ భవన్‌లో నిర్వహించిన ఏఐవైఎఫ్ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంతో పాటు నియోజకవర్గంలోని పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫాం వంటివి పాఠశాలలోనే విక్రయిస్తూ దోచుకుంటున్నారని తెలిపారు.

ప్రణాళికతో సాగు.. దిగుబడులు బాగు


చాపాడు: పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ కృష్ణమూర్తి


కాశినాయన : 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు


గోపవరం: సజ్జపంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

చాపాడు : ఖరీఫ్‌లో ముందస్తు ప్రణాళికతో సాగు చేస్తే అధిక దిగుబడులు, మంచిలాభాలు పొందవచ్చని వ్యవసాయ శాఖ అసిస్టెంటు డైరెక్టర్ కృష్ణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని బద్రిపల్లె, నెర్రవాడ గ్రామాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయం, పంటల సాగు, ఎరువుల వినియోగం, పంటల దిగుబడి వంటి అంశాలపై అవగాహన కల్పించామని తెలిపారు. రైతులు ఏ పంట సాగు చేయాలనుకుంటారో సాగుకు ముందు తమ గ్రామాల పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో గల వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి మెళకువలు, సూచనలు పాటించాలన్నారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని, సరైన మోతాదులోనే రసాయన ఎరువులను వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి దేవి పద్మలత, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లె, కేశలింగాయపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బాలగంగాధర్ రెడ్డి, సూక్ష్మ వ్యవసాయ ఏఓ సిద్ధారెడ్డి పంటల సాగులో యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ చర్యల గురించి రైతులకు వివరించారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలి

కాశినాయన : రైతులు పంట పొలాలకు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని వ్యవసాయాధికారి చంద్రమోహన్ తెలిపారు. మండలంలోని వంకమర్రి, సిద్ధాయపల్లె గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కంది, మినుము పంటల సాగు గురించి రైతులకు వివరించారు. పంటల్లో ప్రధాన పోషకాలైన యూరియా, డీఏపీ, పొటాష్‌తోపాటు సూక్ష్మ పోషకాలైన మెగ్నీషియం, కాల్షియం, జింక్, సల్ఫర్, బోరాన్ పంటలకు అందించాలన్నారు. సాగులో ఉన్న ఉల్లి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రవి, వీఏఏ శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

గోపవరం : ప్రస్తుత సీజన్‌లో వివిధ పంటలు సాగు చేసే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని బద్వేలు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ అన్నారు. బుధవారం మండలంలోని టి.సంద్రపల్లెలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం సాగులో ఉన్న సజ్జ పంటను పరిశీలించి పేకపురుగు ఆశిస్తుందని నివారణ కొరకు కోరాజిన్ పురుగుమందును పిచ్‌కారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో రైతులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలు, విధివిధానాలను వివరించారు. అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం వర్తించేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. రైతులకు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు పంటల సాగు, తదితర అంశాలపైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం రాచాయపేట రైతు సేవాకేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిష్టర్లు, ఈకేవైసీ తదితర అంశాలపైన పరిశీలించారు. వ్యవసాయ విస్తరణాధికారులు విజయ్‌కుమార్, ఓబయ్య, చిట్టి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొనారు.

సూక్ష్మపోషకాలతోనే అధిక దిగుబడులు

బి.కోడూరు : రైతులకు అవసరమైన సూక్ష్మపోషకాలను వినియోగించి అధికలాభాలు పొందవచ్చని ఏడీఏ మురళీధర్ రెడ్డి తెలిపారు. బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా ఐత్రంపేట గ్రామంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో మెలుకువలు పాటిస్తే అధికలాభాలు పొందవచ్చని ఆయన సూచించారు. మండల వ్యవసాయాధికారి కౌశిక, వీఏఏ రాజశేఖర్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై విద్యార్థులకు అవగాహన


సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రాజశేఖర్‌వర్మ

ప్రొద్దుటూరు : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని శ్రీవెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హోలిస్టిక్ హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజశేఖర్ వర్మ మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలిలో ఎంతో మంది మన కళ్ల ముందే కిందపడిపోవడం జరుగుతోందన్నారు. డాక్టర్ దగ్గరికి తీసుకెళ్లేలోపు లేదా అంబులెన్స్ వచ్చే లోపు సీపీఆర్ విధానాన్ని అమలు చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడిన వారమవుతామని తెలిపారు. సీపీఆర్ చేసే విధానాన్ని వీడియో ద్వారా, ప్రాక్టికల్‌గా విద్యార్థులు చూపించి వివరించారు. విద్యార్థులు తమ సందేహాలను డాక్టర్ ద్వారా నివృత్తి చేసుకున్నారు. కళాశాల కరస్పాండెంట్ అరకటవేముల హరినారాయణ మాట్లాడుతూ విద్యార్థులు రోజు జరుగుతున్న మార్పులను బట్టి కొత్త విషయాలను తెలియజేయడంలో తమ కళాశాల ఎప్పుడూ ముందుంటుందన్నారు. అందులో భాగంగా సీపీఆర్ పద్ధతిపై అవాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కళాశాల కోఆర్డినేటర్ పర్లపాడు గౌరీశంకర్ మాట్లాడుతూ రోజు ఎంతో మంది భోజనం చేస్తూ, డ్యాన్స్ చేస్తూ, వారి వృత్తి చేస్తూ కిందపడి ప్రాణాలు కోల్పోవడం చూస్తూనే ఉన్నామన్నారు. కింద పడిన సమయంలో సీపీఆర్ చేయడం ద్వారా వారి ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో నరసింహా, మౌనయ్య, దావీద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి అరుణ

అట్లూరు : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు ఎంతో ఆరోగ్యకరంతో పాటు లాభదాయకంగా ఉంటాయని కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. బద్వేలు మండలం బయనపల్లె గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి మరియు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. అలాగే ఆర్థిక ఆరోగ్య ప్రయోజనాలు కూడా పొందవచ్చని ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యపరమైన ఉత్పత్తులను పెంపొందించడం కోసం రైతులు కృషి చేయాలని పేర్కొన్నారు. పశువిజ్ఞానం శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పశుగ్రాసాల పెంపకం, పశుపోషక యాజమాన్యం, గొర్రెలు, మేకల పెంపకం గురించి మరియు కోళ్లలో వ్యాక్సినేషన్ షెడ్యూలు తదితర అంశాలపై రైతులకు వివరించారు. అలాగే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ మాట్లాడుతూ రైతులు ట్రైకోడెర్మా, సూడోమోనాస్ వినియోగం ప్రధాన పంటలలో కషాయాల ద్వారా పురుగు మరియు తెగుళ్ల యాజమాన్యం, జిగురుఅట్టలు, లింగాకర్షక బుట్టలు, దీపపు ఎరలు, పక్షిస్థావరాలు ద్వారా సస్యరక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి అరుణ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం


ఏఐఎస్‌బీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బద్వేలు అర్బన్ : విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా విద్యార్థుల పక్షాన నిరంతరం పోరాటాలు కొనసాగిస్తామని అఖిల భారత విద్యార్థి బ్లాక్ జిల్లా కన్వీనర్ సగిలి రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఏఐఎస్‌బీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా పట్టణంలో ఎస్‌సి బాలుర కళాశాల వసతి గృహంలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వవిద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు చేకూరుస్తున్నాయని విమర్శించారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చి పాఠశాలల విలీనం పేరుతో పేద, మధ్యతరగతి, గ్రామీణ విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా విద్యార్థులను వేధిస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను భర్తీ చేయకుండా విద్యార్థుల జీవితాలతో చలగాటమాడుతున్నారని అన్నారు. అలాగే సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్‌బి నాయకులు మనోజ్, సుహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు

బ్రహ్మంగారిమఠం : ఖరీఫ్‌లో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి సూచించారు. బుధవారం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ కార్యాలయంలో మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో రైతులు అధికంగా వరి పంటను సాగు చేస్తారని అందుకు అనుగుణంగా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మండల అభివృద్ధికి పార్టీలకు అతీతంగా సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కొందరు అభివృద్ధిని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హితవుపలికారు. అనంతరం మైదుకూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఏపీ రవీంద్ర మాట్లాడుతూ బి.మఠం మండల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. అనంతరం వివిధశాఖలకు సంబంధించిన అధికారులు వారి ప్రణాళికలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షురాలు కూనపులి సుభాషిని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


దక్షిత


నాగశ్రీవిద్య


తన్వీరుల్ హసన్


ఇంతియాజ్


గణేష్


శ్రీలక్ష్మి

బద్వేలు అర్బన్ : ఆర్జీయూకేటీ పరిధిలో ట్రిపుల్ ఐటీలో 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి బుధవారం విడుదల చేసిన ప్రవేశాల జాబితాలో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన అతికారి దక్షిత, తుడిమిళ్ల నాగశ్రీవిద్య నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలకు, పటాన్ తన్వీరుల్ హసన్ ఆర్కే వాలి (ఇడుపులపాయ) ట్రిపుల్ ఐటీ కళాశాలకు, ఎస్.ఇంతియాజ్, పి.గణేష్ ఒంగోలు ట్రిపుల్ ఐటీ కళాశాలకు, ఊట్ల శ్రీలక్ష్మి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ కళాశాలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను, విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

ప్రతి ఉద్యోగికీ బదిలీ సర్వసాధారణం

ప్రొద్దుటూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో, పరిపాలనలో అధికారుల సేవలు మరువలేనివని ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో బుధవారం ప్రొద్దుటూరు నుండి ఇతర మండలాలకు బదిలీపై వెళుతున్న నలుగురు అధికారులకు వీడ్కోలు సభ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణకుమారి, తాళ్లమాపురం, పెద్దశెట్టిపల్లె-1, చౌడూరు గ్రామాల సచివాలయ కార్యదర్శులు ఈశ్వరమ్మ, దివాకర్, భాగ్యలక్ష్మిని ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు అనేవి సర్వసాధారణమన్నారు. ప్రొద్దుటూరులో లాగానే బదిలీలైన ప్రాంతాల్లో కూడా మంచి సేవలు అందించి ప్రజల మన్ననలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ బాలన్న, టైపిస్ట్ చంద్రకళ, కార్యదర్శులు రామకృష్ణ, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో భవిష్యత్తు చిత్తు

పోరుమామిళ్ల : విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలసిన తరుణంలో మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలకు అలవాటుపడితే భవిష్యత్తు చిత్తై భవిష్యత్తు నాశనం అవుతుందని రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ సబిత అన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన రెడ్ రిబ్బన్ క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ సబిత ఆధ్వర్యంలో కొండుగారిపల్లెలో ప్రజలకు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పలితాలు, నష్టాల గురించి అవగాహన కల్పించారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి మత్తుపదార్థాలు వినియోగిస్తే సమాజానికి కలిగే నష్టాల గురించి వివరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు, అధ్యాపకులుశ్రీనివాసులు,నరసింహారెడ్డి, మల్లికార్జున పాల్గొన్నారు.